క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న క్రాంతి కుమార్

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల ప్రధాన రహదారి కూడలల్లో గురువారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. అధిక లోడుతో వెళ్తున్న ఆరు వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.1,80,450 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు.

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో దర్గా కిటకిటలాడింది. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. ఉసేన్‌స్వామికి భక్తులు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బందేనవాజ్ స్వామి గ్రామోత్సవం



ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి కాలనీలో వెలసిన ఖాజా బందేనవాజ్ స్వామి దర్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో గురువారం స్వామివారి షంషేర్‌ను పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు షంషేర్‌ను దర్శించుకుని స్వామి వారికి చెక్కెర ఫాతెహాలు సమర్పించుకున్నారు. మేళతాళాల మధ్య సాగిన గ్రామోత్సవంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు

డోన్ టౌన్ : కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివరామ్ పేర్కొన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని గురువారం స్థానిక కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్‌తో కలిసి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధనకు కార్మికులు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు నాగన్న, చిన్నరహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

డోన్ టౌన్ : ఏపీ స్టేట్ స్టూడెంట్స్ ఫెడరేషన్(ఏపీఎస్‌ఎస్‌ఎఫ్) డోన్ మండల నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధక్ష్యుడు ఇమిడి లక్ష్మణ్ సాయినాథ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డోన్ మండల నూతన అధ్యక్షుడిగా బెస్త వెంకటేష్, కార్యవర్గ సభ్యునిగా వడ్డే మనోజ్‌కుమార్‌ను సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటాలు చేస్తామన్నారు. త్వరలో పట్టణంలో జెండా ఆవిష్కరణ, రాష్ట్ర అధ్యక్షుడి సన్మాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మండల కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలు

బనగానపల్లెరూరల్ : విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండల కేంద్రం బనగానపల్లెకు చేరాయి. ఇప్పటికే నోటు పుస్తకాలు వంద శాతం వచ్చాయని, 1,2,6వ తరగతులకు సంబంధించి మొత్తం 9,048 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, గురువారం రోజు 8,9,10వ తరగతికి సంబంధించి సీబీఎస్‌ఈ సిలబస్ పాఠ్య పుస్తకాలు మొత్తం 43,230 పాఠ్యపుస్తకాలు వంద శాతం వచ్చినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. మరికొన్ని తరగతుల పాఠ్యపుస్తకాలు రెండు, మూడు రోజుల్లో వస్తాయన్నారు. పాఠశాలలు తెరచిన మొదటి రోజే విద్యార్థులకు పుస్తకాలతోపాటు బ్యాగ్, షూ తదితర వస్తువులను అందజేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ముంజెలు..లాభాలు బోలెడు!

- వేసవి నుంచి ఉపశమనం
- ఎగబడుతున్న జనం
- రోజుకు వంద డజన్లకుపైగానే విక్రయాలు



కోవెలకుంట్లలో తాటిముంజెలు విక్రయిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: వేసవికాలంలో ప్రతి ఒక్కరూ ఇష్టపడేవాటిలో తాటిముంజెలు ఒక్కటి. శరీరంలో వేడిమిని తగ్గించే గుణం ఉండటంతో పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టపడి తాటిముంజెలను తింటారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు వీటిని తీసుకుంటే శరీరాన్ని డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. ఇటీవల కాలంలో ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నా రోహిణికార్తె ప్రారంభం కావడంతో నంద్యాల జిల్లాలోని ఆయా మండలాల్లో రెండు రోజుల నుంచి తిరిగి ఎండలు అధికమయ్యాయి. వేడిమి సెగలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉపశమనం కోసం జనం పాకులాడుతున్నారు. కూల్‌డ్రింక్స్, చెరుకు రసం, జ్యూస్ తదిర పానియాలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో తాటి ముంజెలు కొనుగోలుకు జనం ఎగబడుతున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని నాగులకట్ట, ఎస్ఎల్‌వీటీ సినిమా థియేటర్, సంతమార్కెట్ తదితర ప్రాంతాల్లో తాటిముంజెల విక్రయాలు సాగుతున్నాయి. బనగానపల్లె మండలం చిన్న రాజు పాలెం తండా, బేతంచెర్ల మండలం యంబాయి తదితర ప్రాంతాల నుంచి ముంజెలు తీసుకొచ్చి డజన్ రూ. 100 ప్రకారం విక్రయిస్తున్నారు. రోజుకు 130 నుంచి 150 డజన్ల వరకు విక్రయాలు జరుపుతున్నట్లు విక్రయదారులు పేర్కొన్నారు.

తాటిముంజెలతో లాభాలు ఇవి

- తాటిముంజెల్లో అధిక తేమ శాతం ఉండటంతో శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ కాల్షియం, ప్రొటీన్లు, ఐరన్ ఇతర విటమిన్లు ఉంటాయి
- వేడిమితో బాధపడేవారంతా తాటిముంజెలు తీసుకుంటే డీహైడ్రేషన్‌నుంచి రక్షిస్తుంది
- ఎసిడిటీ, మలబద్దకం, అల్సర్ సమస్యలను నివారిస్తూ జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి
- వేసవిలో దద్దుర్లు, అలర్జీ వస్తుంటుంది. ముంజెలు తిన్నా, గుజ్జు రాసుకున్నా చర్మం పొడిబారే సమస్యను నివారిస్తాయి.

వంద గ్రాముల తాటిముంజెల నుంచి పొందే పోషకాలు

నీరు	87.6 గ్రాములు
శక్తి	43 క్యాలరీలు
పీచు	1 గ్రాము
పిండి పదార్థాలు	10.9 గ్రాములు
కొవ్వులు	0.1 గ్రాము
ఐరన్	1 గ్రాము
ప్రొటీన్లు	0.8 గ్రాములు
కాల్షియం	27 మిల్లీగ్రాములు
ఫాస్పరస్	90 మిల్లీగ్రాములు
మెగ్నీషియం	10 మిల్లీగ్రాములు
సోడియం	20 మిల్లీ గ్రాములు
పొటాషియం	150 మిల్లీ గ్రాములు
విటమిన్‌- సి	5 మిల్లీ గ్రాములు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అభివృద్ధిపై తీర్మానాలు లేకుండా సమస్యలపై చర్చించారు. విద్య, వైద్యం, విద్యుత్, పశువైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర శాఖల నివేదికలను అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలను చైతన్య పరచాలన్నారు. పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ అధికారులకు సూచించారు. సబ్సిడీ వేరుశనగ, కంది, కొర్ర, పెసలు, మినుము విత్తనాల కోసం ఆర్బీకేలలో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివలక్ష్మీ, వైస్ ఎంపీపీ రంగస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు నారాయణ, ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, సర్పంచ్‌లు రాజు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, శ్రీరాములు, చిన్న మద్దమ్మ, ఎంపీటీసీలు నాగేషు, రామచంద్రారెడ్డి, రామనాథం, శాంతి, ఇందిరమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

డోన్ టౌన్ : పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 22వ వార్డులో గురువారం కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కల సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆయా కాలనీల ప్రజలకు సూచించారు. ఖాళీ స్థలాలకు సంబంధించి యాజమాన్యాలు శుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో నోటీసులు జారీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా పాల్గొన్నారు.

బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలి



బీసీజీ టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బీసీజీ టీకాను తప్పనిరిగా వేయించుకోవాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ సరళగంగ అన్నారు. గురువారం పలుకూరు గ్రామంలో బీసీజీ టీకా వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సుతో ఆమె మాట్లాడారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీ టీకా ఎంతో మేలు చేకూర్చడం జరుగుతుందన్నారు. ఎత్తుకు తగిన బరువులేనివారు, క్షయవ్యాధి బాధితులు,వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వేయించు కోవాలన్నారు. కిడ్నీ సమస్య, గుండెవ్యాధికి సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తులు టీకాను వేయించుకోరాదని సూచించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి, హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, రంగనాగమహేశ్వరి, ఆశా వర్కర్లు తదతరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చిన్నపాదిళ్ల గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్యాపిలి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని చిన్నపాదిళ్ల గ్రామంలో గురువారం ఆయన సిబ్బందితో కలసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల కోడ్, పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసు నిఘా ఉందన్నారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితాలు ఎలా ఉన్నా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలు పాటించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం నిషేధం అన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

డోన్ టౌన్ : ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్పలు హెచ్చరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులనే వసూళ్లు చేయాలని, నోటీసు బోర్డులో తప్పనిసరిగా ఫీజుల వివరాలను పొందపరచాలన్నారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పు:న ప్రారంభం అవుతాయని, స్కూళ్లతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనుమతుల మేరకు ప్రవేశాలు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల్లో పుస్తకాలు, ఇతరత్రా వస్తువులు విక్రయించరాదని, కండిషన్‌లో ఉన్న బస్సులను ఉంచుకోవాలని సూచించారు.

ఐదేళ్లలో అద్భుతమైన పాలన



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అద్భుతమైన పాలన సాగిందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా స్వీకారం చేసి ఐదేళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. రెండేళ్ల పాటు కరోనాతో ఇబ్బందులు ఎదుర్కొన్నా సంక్షేమ పథకాలు ఆపకుండా అమలు చేశారని గుర్తు చేశారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే తలంపుతో ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసి సమూలమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు సుపరిపాలన అందించండతోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు సీఎం జగన్‌కు మద్దతుగా నిలిచారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, మాజీ ఎంపీపీ రామాంజనేయలు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, అంబటి రామ్మోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, రవిప్రకాష్, ఎంకె నాయుడు, రామనాథరెడ్డి, సుబ్బయ్య, బాసు, తోట శివశంకర్‌రెడ్డి, డాక్టర్ దస్తగిరి, శ్రీకాంత్‌రెడ్డి, హుశేని, శివ, కేశవ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

1న హనుమాన్ జయంతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోర్నపల్లె సమీపాన ఉన్న గుండం ఆంజనేయస్వామి ఆలయంలో జూన్1వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ఆకుపూజ నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

బేతంచెర్ల: స్థానిక కార్యాలయంలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 1970, మే 30న కలకత్తా నగరంలో కమ్యూనిస్టు యోధులు జ్యోతి బసు, రణదీవే, నంబుదిప్రసాద్ సీఐటీయూ సంఘాన్ని ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య గుర్తు చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



కునుకుంట్లలో దూడకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారిణి భారతీదేవి

అవుకు: సీజనల్ వ్యాధులు సోకకుండా పశుపోషకులు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. గురువారం అవుకు మండల పరిధిలోని ఉప్పలపాడు, కునుకుంట్ల గ్రామాల్లో పశువులకు గొంతువ్యాపు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈదురు గాలులు, వర్షపు జల్లులు కురవటం వల్ల జోరీగలు, దోమల సంఖ్య పెరిగి పశువులు గొంతువాపు వ్యాధి బారిన పడతాయని తెలిపారు. పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరిగినా, గొంతు మెడ వాచి ఇబ్బంది పడుతూ శ్వాస తీసుకుంటున్నా పశువైద్య సిబబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన పాడి సంపదను కోల్పోవల్సిన ప్రమాదం ఉంటుందన్నారు. ఎల్ఎస్ఏ రాజేష్, ఏహెచ్‌ఏలు భార్గవి, ఓబులేసు, మహేంద్ర, గణేష్, సిబ్బంది,హరినాథ్, బాల మద్దిలేటి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి సూచించారు. కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారి, రేవనూరు పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె తదితర ప్రాంతాలవైపు వెళ్తున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ప్రకృతి ఒడిలో ఓబులేసుకోన!

- కొండపాన్పు కింద కొలువైన లక్ష్మీనరసింహస్వామి
- కొండలో నుంచి నిత్యం జలప్రవాహం



పూర్వం పూజించే స్వామివారి రాతి విగ్రహాలు

కొలిమిగుండ్ల: ఎత్తైన ఎర్రటి కొండ.. పచ్చని రకరకాల వృక్ష జాతులు..నీటి ధారలు.. వన్య ప్రాణులకు ఆలవాలమైన ఓబులేసు కోన ప్రకృతి ఒడిలో ఒదిగిపోయింది. అబ్దులాపురం, మదనంతపురం గ్రామాల సరిహద్దులో కొండలో అతి పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఏర్పాటైంది. ఇక్కడ స్వామివారు నడిచినట్లుగా భక్తులు చెబుతుంటారు. దాదాపు 500 అడుగుల ఎత్తులో కొండ పాన్పులో స్వామి కొలువై ఉండటం విశేషం. వందల ఏళ్ల నుంచి భక్తులు రాతి శిలలనే పూజిస్తు వచ్చారు. భక్తులు ఆలయానికి చేరుకోవాలంటే అబ్దులాపురం నుంచి కాలినడకన అతి కష్టం మీద కొండపైకి చేరుకోవాల్సి ఉండేది. 2004లో రాతి శిలల స్థానంలో భక్తులు లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కొండ పాన్పు చుట్టు రాతి కట్టడం నిర్మించి ఆలయంగా మార్పు చేశారు. అబ్దులాపురం, మదనంతపురం, తిమ్మనాయినపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు చాలా కష్టపడి నడక మార్గంలోనే సామాగ్రిని మోసుకొచ్చి అవసరమైన వసతులు ఏర్పాటు చేశారు. 2009లో కొండపై పవన విద్యుత్‌కు చెందిన గాలిమరలు ఏర్పాటు కావడంతో ఆ సంస్థ మదనంతపురం సమీపంలోని ప్రధాన రహదారి నుంచి కొండపైకి మట్టి దారి సౌకర్యం కల్పించడంతో భక్తులకు ఊరట లభించింది. ప్రతి శనివారం స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లిస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చుతాడనే భక్తుల ప్రగాఢ నమ్మకం. చాలా మంది ఓబులేసు పేర్లు పెట్టుకున్నారు. ఆలయం పక్కలోనే ఉన్న దీపం వెలిగిస్తే రాత్రివేళల్లో అబ్దులాపురం, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లెతో పాటు వైఎస్సార్ కడప జిల్లా దబ్బుడపల్లె వరకు కనిపిస్తుంటుందని నానుడి.

నిత్యం నీటి ధారలు

ఎత్తైన కొండలో స్వామి చెంతనుంచి నిత్యం నీటి ధారలు ప్రవహిస్తుంటాయి. ఎక్కడి నుంచి నీళ్లు వస్తున్నాయనేది అంతు చిక్కని ప్రశ్న. స్వామిని దర్శించుకునే భక్తులు ఇక్కడే వంట చేసుకుంటారు. కొండలో నుంచి ప్రవహించే జలధారలే వాడుకుంటారు. గతంలో నీళ్లు వృథాగా కొండ దిగువకు వెళ్తుండటంతో భక్తుల చొరవతో చుట్టు రాతి కట్టడం నిర్మించి నీటి నిల్వ చేరేలా చేశారు. నీళ్లు చాలా రుచిగా ఉంటాయని భక్తులు పేర్కొన్నారు. కొండకు ఎటు వైపు చూసినా నీటి జాడ లేక పోయినా ఏడాది పొడవునా ఇక్కడ కొండ మధ్యలో నుంచి నీళ్లు ప్రవహించడంతో స్వామి మహిమగా భక్తులు భావిస్తున్నారు. దశాబ్దాల క్రితం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కరువు పరిస్థితులు ఏర్పడిన సమయంలో కొండపై నుంచి నీళ్లను తీసుకెళ్లినట్లు పూర్వికుల మాట.

ఏడు వాకిళ్ల గొంది

ఓబులేసు కోనకు ఐదు వందల మీటర్ల దూరంలో కొండలో ఏడు వాకిళ్ల గొంది సహజ సిద్ధంగా అవతరించింది. పచ్చని చెట్ల మధ్యలో పెద్ద రాతి గుండుకు ఏడు వాకిళ్లు ఏర్పడ్డాయి. ఇక్కడికి చేరుకోవాలంటే భక్తులు కష్టపడాల్సి ఉంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యహరించినా కొండ దిగువకు పడిపోయే ప్రమాదం ఉంటుంది. గుండుకు విశాలంగా ఉండే ఏడు వాకిళ్లు ఉన్నాయి. చాలా మంది భక్తులు ఇక్కడికి చేరుకొని లోపల ప్రదక్షణ తరహాలో తిరుగుతు ఉంటారు. సంతానం లేని మహిళలు ఇక్కడ తిరుగుతే సంతానం ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఉంది. అబ్దులాపురం భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లలోనూ ఏడువాకిళ్ల గొంది సమీపంలో అని రికార్డుల్లోనూ ఉండటం విశేషం.




కొత్తగా ప్రతిష్టించిన స్వామివారు



కొండపాన్పు కింద నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం



కొండలో నుంచి జలధారలు



రాతి గుండుకు ఉన్న వాకిళ్లు

చుక్కలనంటుతున్న కూరగాయల ధరలు



బనగానపల్లె: కూరగాయల ధరలు చుక్కలంటుతున్నాయి. బనగానపల్లె కూరగాయలమార్కెట్‌లో గత 10 రోజులుగా ధరలు ఆకాశాన్నంటాయి. ఊహించని విధంగా పెరిగిన ఈ ధరలతో మధ్యతరగతి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీన్స్, మిరప, కాకర కిలో ఏకంగా రూ.100 చేరడంతో ధరలు ఏ విధంగా పెరిగాయో తెలుస్తోంది. బీర, క్యారెట్, కాలీఫ్లవర్, వంకాయలు, ముల్లంగి, మునగ ధరలు కిలో రూ.80కి చేరాయి. ఇతర కూరగాయల ధరలు సైతం యాభైపైమాటే. పది రోజుల క్రితం వరకు వీటి ధరలు రూ.50–60ల వరకే ఉన్నట్లు వ్యాపారులే అంగికరిస్తున్నారు. ప్రతేటా వేసవిలో కూరగాయల ధరలు ఎక్కువగా ఉండేవి, వేసవి ముగుస్తున్న సమయంలో ఈ ధరలు చుక్కలంటుతుండడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయాల ధరలను నియంత్రించాలని సామాన్యులు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మమ్మ అవ్వ జయంతి

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో గురువారం మహాయోగి ఆదోని లక్ష్మమ్మ అవ్వ 92వ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మాచాని నారాయణమ్మ ఆధ్వర్యంలో అమ్మ విగ్రహానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.